భువనగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న బీఆర్ఎస్ కొంగరకలాన్ నాయకులు

గెలుపునకు కృషి చేయాలి

- భువనగిరి గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం
- బీఆర్ఎస్ కొంగరకలాన్ నాయకులు

ఆదిబట్ల, మార్చి 25 : ఎంపీ ఎన్నికల్లో భువనగిరి గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని, క్యామ మల్లేశ్ గెలుపునకు కృషి చేస్తామని బీఆర్ఎస్ కొంగరకలాన్ నాయకులు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు బాబులు, నారాయణ, రవీందర్, మహేందర్, కృపాకర్, ప్రవీణ్ మాట్లాడుతూ.. కేసీఆర్ బీసీ బడుగు బలహీన వర్గాలకు భువనగిరి పార్లమెంట్ స్థానం కేటాయించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కలిసికట్టుగా పని చేసి మల్లేశ్ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పార్టీని నమ్ముకున్న వ్యక్తి క్యామ అని అన్నారు. బీఆర్ఎస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు.

త్వరలో నియోజకవర్గస్థాయి సమావేశాలు

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు క్యామ మల్లేశ్ తెలిపారు. ముందుగా పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అల్ప్రాజోలం తరలిస్తున్న ముఠా అరెస్ట్

రూ.13 లక్షల విలువ చేసే కిలో అల్ప్రాజోలం, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం

పోలీసుల అదుపులో నిందితులు, అల్ప్రాజోలం, కారు, సెల్‌ఫోన్లు

కొత్తూరు, మార్చి 25 : నిషేధిత మత్తు పదార్థం అల్ప్రాజోలంను అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును కొత్తూరు పోలీసులు రట్టు చేశారు. ఈ సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయలక్ష్మి ఏరియాలో జరిగింది. కొత్తూరు ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి విజయలక్ష్మి పారిశ్రామిక ప్రాంతంలో నిషేధిత అల్ప్రాజోలమ్‌ను తరలిస్తున్న ముగ్గురిని గుర్తించారు. వారి నుంచి రూ.13 లక్షల విలువ చేసే సుమారు కేజీ అల్ప్రాజోలమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారు ఉపయోగించిన కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరు మహబూబ్‌నగర్ జిల్లా వెల్కిచర్లకు చెందిన అనిల్‌గౌడ్, మహబూబ్‌నగర్ టౌన్‌కు చెందిన సుధాకర్(42), తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి చెందిన శరత్‌బాబు(30)గా గుర్తించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కల్లులో మత్తు రావడానికి వాడే అల్ప్రాజోలమ్‌ను వీర సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్, జడ్చర్ల, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో అల్ప్రాజోలమ్‌ను విక్రయిస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు.

ఆధారం చూపితే..

నగదు వెనక్కి

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

- ఎన్నికల వేళ తనిఖీలు ముమ్మరం
- ఇప్పటి వరకు రూ.2.24 కోట్ల నగదు పట్టివేత

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల వేళ ఎన్నికల యంత్రాంగం నిఘాను మరింత పెంచింది. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 50 వేల నగదుకు మించి తీసుకువెళితే పట్టుకొని సీజ్ చేస్తున్నారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించిన ఆధారాలను చూపితే అప్పగించే దిశగా జిల్లా గ్రీవెన్స్ కమిటీ చర్యలు తీసుకుంటున్నది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచి ఇప్పటి వరకు రూ.2.24 కోట్ల నగదు, రూ.32.91 లక్షల ఇతర వస్తువులు, 1045 లీటర్ల మద్యం, 61 మందిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి సోమవారం వరకు జిల్లాలో వివిధ ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ద్వారా విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా.. రూ.4.60 లక్షల నగదును పట్టుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. వీటితో పాటు రూ.3.06 లక్షల విలువ గల వివిధ రకాల వస్తువులను కూడా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.3.45 లక్షల నగదు పట్టుకొని సీజ్ చేశామన్నారు. పోలీసుల ద్వారా రూ.1.15 లక్షల నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. నగదు, ఇతర వస్తువుల రవాణాపై 22 ఫిర్యాదులు రాగా, వాటిని పరిశీలించి, పరిష్కరించినట్టు తెలిపారు. 20 ఎఫ్ఐఆర్‌లు, 360.90 లీటర్ల అక్రమ మద్యంను పట్టుకున్నామని, 20 మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

దరఖాస్తు చేసి ఆధారం చూపితే..

పార్లమెంట్ ఎన్నికల వేళ.. ప్రతి అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఆస్కారం ఉన్న ఏ విషయాన్ని కూడా విస్మరించడం లేదు. వ్యాపారం, వివిధ వస్తువుల కొనుగోళ్లు, బ్యాంకుల్లో నగదు జమ, ఇతర శుభకార్యాలు, అత్యవసర పనుల నిమిత్తం నగదు తీసుకువెళ్తూ అధికారులకు చిక్కుతున్నారు. ఇలా తనిఖీల్లో పట్టుబడిన నగదు వివరాలను సంబంధిత అధికారులు గ్రీవెన్స్ కమిటీకి చేరవేరుస్తున్నారు. సదరు సొమ్ము తిరిగి ఇవ్వాలని బాధితులు గ్రీవెన్స్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి. నగదును అవసరాల నిమిత్తం తీసుకువెళ్తున్నట్లు నిర్ధారణకు వచ్చిన తర్వాతే.. తిరిగి ఆ నగదును ఇచ్చేందుకు రిలీజింగ్ ఆర్డర్ (ఆర్‌వో) ఇస్తున్నారు. జాప్యం లేకుండా సరైన పత్రాలు ఉంటే ఆర్ఓ ఇస్తున్నారు. సదరు ఆర్ఓను గ్రీవెన్స్ కమిటీ, ఠాణా ఎస్‌హెచ్ఓ, రిటర్నింగ్ అధికారి సంబంధిత బాధితుడికి అందజేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దంపతులు

- హాజరైన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ

కులకచర్ల, మార్చి 25 : కులకచర్ల మండలం బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరై సుమారు రెండు కిలోమీటర్ల మేర భక్తులతోపాటు పాంబండ గిరి చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాంబండ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఆలయానికి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు.

ప్రముఖ వక్త, రచయిత భాస్కరయోగి మాట్లాడుతూ.. ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు కావాలన్నారు. దేవునిపైనే ధ్యాస ఉండాలని అప్పుడే అనుకున్నది జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కులకచర్ల ఎంపీపీ సత్యమ్మ, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు అంజిలయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, లక్ష్మి, ఆలయ ఈవో సుధాకర్, ఆలయ చైర్‌పర్సన్ నర్సమ్మ, నిర్వాహకులు, పూజారులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉపశమనానికి తాటిముంజలు

- వేసవి తాపాన్ని తగ్గించేందుకు ఉపయోగం
- సాగర్ రహదారిపై జోరుగా తాటిముంజల విక్రయాలు

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 25 : వేసవిలో ఏదైనా పనిపై బయటకు వెళ్లొస్తే చాలు త్వరగా అలసిపోతాం. చెమట విపరీతంగా పోయి, శరీరంలో నీటిశాతం తగ్గిపోయి ఉష్ణోగ్రతలు పెరిగి, జీర్ణక్రియ మందగిస్తుంది. ఈ సమయంలో నాలుగు తాటిముంజలు తింటే తాపం తగ్గుతుంది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది. ఈ తాటిముంజలు శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచి, శరీరానికి కావల్సిన న్యూట్రియంట్లను బ్యాలన్స్ చేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాటిముంజలకు భలే క్రేజీ ఉంటుంది. వేసవికాలంలో లభించే ఈ తాటి ముంజలను ప్రతి ఒక్కరూ ఇష్టంగా తీసుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు తాటిముంజలు భలే ఉపయోగపడుతాయి. తాటి ముంజల్లో శరీరానికి ఉపయోగపడే ఎన్నో పోషకాలున్నాయంటున్నారు వైద్యులు.

తినేందుకు ఉత్సాహం

తాటి ముంజలు పూర్తిగా ఆర్గానిక్ ఫుడ్. ఎలాంటి ఎరువులు, మందులు వాడకుండా ప్రకృతి సిద్ధంగా దొరికే ఫలాల్లో ఇది ఒకటి. ఇవి సర్వరోగ నివారిణి. గ్రామీణ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా పెరిగే తాటిచెట్లు (పరుపు తాళ్లు) మార్చి నెలలో గెలలు వేస్తాయి. గీత కార్మికులు కల్లు గీయగా వదిలేసిన గెలలు ముంజలుగా వృద్ధి చెందుతాయి. మే నెలలో ముంజలు విరివిగా దొరుకుతాయి. ఈ సీజన్‌లో వాటిని తినడానికి ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపిస్తుంటారు. ఈ తాటి ముంజలను గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇష్టపడుతారు. తాటి ముంజలను నగరానికి తీసుకుపోయి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు గీతకార్మికులు. డజన్ ముంజలను రూ.40 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు.

తాటిముంజలతో లాభాలు

> తాటిముంజల్లో విటమిన్ ఏ, బీ7, సీ, డీ, కే, ఐరన్ క్యాల్షియం, బీ కాంప్లెక్స్, నియాసిన్, రిబోఫ్లేవీన్, దయామిన్, జింక్ ఫాస్పరస్, ఐరన్, పొటాషియం, సోలెబుల్, ఫైబర్, న్యూట్రీన్స్ ఉంటాయి.

> నీటి శాతం ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగలకుండా చేస్తుంది. శరీర ఉష్ణోగ్రతను తగ్గించి డీహైడ్రేషన్‌కు గురికాకుండా చేస్తుంది. వడదెబ్బ తగిలినవాళ్లకు ముంజలను జ్యూస్‌గా చేసి ఇస్తే వెంటనే ఉపశమనం లభిస్తుంది.

మెగా కల్యాణ వేదిక రజతోత్సవాలు



మల్కాజిగిరిలో మెగా బ్రాహ్మణ కల్యాణ వేదిక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్కాజిగిరి, మార్చి 25 : బ్రాహ్మణులకు, బ్రాహ్మణులతోనే వివాహాలు జరగాలనే లక్ష్యంతో 'కల్యాణ వేదిక'లు నిర్వహిస్తున్నామని కల్యాణ వేదిక నాయకుడు ఓఎస్ఆర్ శర్మ అన్నారు. సోమవారం మల్కాజిగిరిలో కల్యాణ వేదిక కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్యాణ వేదిక నాయకుడు శర్మ మాట్లాడుతూ. గత ఇరవై ఐదు ఏండ్లుగా కల్యాణ వేదికను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెగా బ్రాహ్మణ వేదికకు మల్కాజిగిరి బృందావన్ గార్డెన్స్‌లో ఏప్రిల్ 14న రజతోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెబ్‌సైట్ www.kalyaanavedika.co.inను ప్రారంభించామని, వివాహాల కోసం బ్రాహ్మణ యువత తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నం.99857 95760లో ఏప్రిల్ 5లోగా సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాంబాబు, వీకేకేబీఏ శర్మ, వాసుదేవరావు, వేణుగోపాల్‌రావు, ఆర్‌కే మూర్తి, ఎస్ఎన్ చారి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ తెలుగు శాఖ సందర్శన

మైసూర్ నుంచి వచ్చిన బృందంతో మాట్లాడుతున్న వర్సిటీ అధ్యాపకులు

కొండాపూర్, మార్చి 25: మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థలో శిక్షణ పొందుతున్న పరిశోధక అధ్యాపకుల బృందం సోమవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ, అంతరిస్తున్న భాషలు, మాతృభాషల అధ్యయన సంస్థ (సీఈఎల్ అండ్ ఎంటీఎస్)లను సందర్శించారు. ఆరుగురు సభ్యులతో కూడిన బృందానికి డాక్టర్ మిరియాల సత్యనారాయణ నేతృత్వం వహించారు. వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, సీఈఎల్ అండ్ ఎంటీఎస్ శాఖ అధ్యక్షులు పమ్మి పవన్ కుమార్ ఆయా శాఖలకు చెందిన ఆచార్యులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థలో 10 నెలల కోర్సులో భాగంగా తెలుగు, తమిళం, మళయాళం, కన్నడ భాషలలో శిక్షణనిస్తున్నట్లు సత్యనారాయణ అన్నారు. తెలుగు నేర్చుకుంటున్న తెలుగు టీచర్లు భాషా వైవిధ్యాన్ని తెలుసుకునేందుకు తెలుగు రాష్ట్రాలలో పర్యటిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే సెంట్రల్ యూనివర్సిటీని ఎంపిక చేసుకుని పర్యటించినట్లు తెలిపారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంతో వివిధ అంశాలపై కలిసి పనిచేసేందుకు ఎంవోయూను చేసుకోవాలని భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

గడ్డి దొరకడం గగనమైంది..

- ట్రాక్టర్ వరిగడ్డికి రూ.20వేలకు పైగా పలుకుతున్న వైనం
- కొనలేక నానా తంటాలు పడుతున్న అన్నదాతలు

పశుగ్రాసం లేక లారీద్వారా వరిగడ్డి తరలిస్తున్న రైతు

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 25 : వేసవికాలం రాకముందే పశుగ్రాసం కొరత తీవ్రమైంది. ఈసారి తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో శీతాకాలంలోనే గడ్డి ఎండిపోయింది. మూగజీవాలకు గడ్డి దొరకడం గగనమైంది. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి గేదెలను పోషించుకుని జీవనం సాగిస్తున్నారు. పశుగ్రాసం కొరత ఏర్పడటంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. ఒక్క ట్రాక్టర్ వరిగడ్డి కొనాలంటే రూ.20వేలకు పైగా, లారీ వరిగడ్డి కొనాలంటే రూ.40వేలకు పైగా ధర పలుకుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులు

పంటలకు సరిపడా నీళ్లు అందక రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పశుగ్రాసం కొరత ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రైతులు పాడి పశువులు, మేకలు, గొర్రెల పెంపకం చేపడుతున్నారు.1.62 లక్షల గొర్రెలు, మేకలు., 10వేల ఆవులు, గేదెలున్నాయి. పాడి గేదెలకు పచ్చిగడ్డి లేకపోవడంతో వరిగడ్డి వేయడంతో పాల ఉత్పత్తి కూడా తగ్గుతున్నదని రైతులు అంటున్నారు వరిగడ్డి లభించకపోవడంతో రైతులు పశువులను అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నారు.

వరిగడ్డికి పెరిగిన డిమాండ్

పాడి పశువులకు రైతులు అధికంగా వరిగడ్డి, పచ్చిమేత ఉపయోగిస్తారు. ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా నీళ్లులేక రైతులు వరిసాగు చేయలేదు. కొద్దిపాటి నీళ్లు ఉన్నవారు మాత్రమే వరిసాగు చేయడంతో వరిగడ్డికి చాలా డిమాండ్ పెరిగింది. ట్రాక్టర్ వరిగడ్డికి రూ.20వేలకు పలుకుతున్నది. కొంత మంది రైతులు స్థానికంగా వరిగడ్డి లభించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు పాడి రైతులు మొక్కజొన్న చొప్పను కూడా కొనుగోలు చేసి కుట్టిపట్టి పశువులకు దానగా పెడుతున్నారు.

తీవ్రమైన పశుగ్రాసం కొరత

నాకున్న పొలంలో వరి పంట సాగు చేస్తే పంటపోనువచ్చిన గడ్డిని పశువులకు వేసేవాడిని, కాని, నీరు సరిగ్గాలేకపోవటంతో పాటు ఉన్న నీరుతో పొలం సాగుచేసుకుందామంటే కాంగ్రెస్ సర్కారు వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయటంలేదు. దీంతో ఇబ్బందిగా మారిన వరిగడ్డి లేక ఉన్న గేదెలను సాకేందుకు ఇబ్బంది పడుతున్నా.

- సురేందర్, రైతు, రాయపోల్

వరిగడ్డి కొనాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి

పశువులకు వరిగడ్డి కొనాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. నాకున్న ఆవులకు గడ్డి కొనటానికి అడిగితే ఒక్క ట్రాక్టర్‌కు సుమారు 20వేల వరకు అవుతుందని బేరగాడు చెప్పాడు. చేసేదేమీలేక నాకున్న ఆవుల్లో రెండుఆవులు అమ్ముకుని ఒక్క ఆవుతో నా కుటుంబానికి ఆసరాగా నిలిపాను. మూగజీవాలకు పశుగ్రాసం కొరత తీర్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం అందించాలి.

- అంజయ్య, రైతు

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ అమ్మవారు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొడంగల్, మార్చి 25 : లక్ష్మీ అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం స్థానిక మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీ అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ఆస్థాన మంటపంలో తిరుచ్చిపై తీసుకువచ్చి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

పట్టుబడ్డ నగదుతో పోలీసులు

తనిఖీల్లో రూ.లక్ష సీజ్

కొడంగల్, మార్చి 25 : పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా తెలంగాణ-కర్ణాటక బార్డర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని చంద్రకల్ గ్రామ తెలంగాణ-కర్ణాటక బార్డర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ.లక్ష గుర్తించినట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారును సోదా చేయగా కారులో ప్రయాణిస్తున్నవారు రూ.లక్ష తీసుకెళ్లారని.. ప్రయాణికులు ఆధారాలు చూపించకపోవడంతో ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.లక్ష స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం

- హెల్పర్ పైనుంచి వెళ్లిన బోరు మోటర్
- అక్కడికక్కడే మృతి

చేవెళ్ల రూరల్, మార్చి 25 : వ్యవసాయ క్షేత్రంలో బోరు వేస్తుండగా హెల్పర్ పక్కనే నిద్రపోవడంతో డ్రైవర్ వెరెక చూసుకోకుండా అతడి పైనుంచి తీసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామ సమీపంలో జరిగింది. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. చేవెళ్లకు చెందిన వెంకటేశ్వర బోర్‌వెల్స్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన చెందిన బామన్ పోయామి(19) హెల్పర్‌గా పని చేస్తున్నాడు.ఆదివారం ఉదయం 4:30 గంటలకు మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎదిరె యాదయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో బోరు వేస్తుండగా బామన్ పోయామి తనకు నిద్ర వస్తుందని అక్కడే కొద్ది దూరంలో నిద్రపోయాడు. అది గమనించని బోర్ మోటర్ డ్రైవర్ సురకంటి రవీందర్‌రెడ్డి మోటర్‌ను వెనుకకు తీయడంతో పక్కనే నిద్రిస్తున్న బామన్ పోయామిపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని తెలుస్తున్నది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బండ్లగూడ, మార్చి 25: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అత్తాపూర్ సిక్‌చౌనీకి చెందిన హ్యాపీ సింగ్(18) శ్మశానవాటికలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.